క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయుల బదిలీలు జరిగి మూడు నెలలు కూడా కాకుండానే పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలలకు పంపటం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, జి.విజయ కుమార్ తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు మూడు నెలలగా జీతాలు అందటం లేదని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కె.శామ్యూల్‌కు వినతి పత్రం అందచేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు పరిష్కరించాలని కోరారు. సస్పెండ్‌లో ఉన్న ఉపాధ్యాయులపై విచారణ పూర్తిచేసి పోస్టింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో భోజన సేవ



నరసరావుపేట ఈస్ట్: అరండల్‌పేటలోని శ్రీసత్యసాయి మందిరం శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నారాయణ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పల్నాడురోడ్డులోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత భోజన సేవ నిర్వహించారు. శ్రీ షిర్డీ సాయి మందిరం కమిటీ అధ్యక్షుడు భాగవతుల లక్ష్మీనారాయణ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని భోజన సేవను ప్రారంభించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు భోజన సేవను అందించినట్లు సేవా సమితి కన్వీనర్ హరినాథ్‌బాబు తెలిపారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు



చిలకలూరిపేట: ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని మురికిపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య చెప్పారు. పఠాన్ చిన్న సత్తార్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థిని షేక్ ఖాశింబికు రూ. 50 వేలు ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. నిరుపేద విద్యార్థులకు ట్రస్టు నిరంతరం అండగా నిలవడం అభినందనీయమని చెప్పారు. ట్రస్టు చైర్మన్ పఠాన్ యూసుఫ్‌ఖాన్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్య అనంతరం పేదలకు సేవ చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆరాధ్యుల రామకృష్ణ, గట్టా రమేష్, పఠాన్ నజీర్ పాల్గొన్నారు.

సాతులూరులో అగ్రికెమికల్స్ ప్లాంట్ పరిశీలన



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ముద్రా అగ్రి కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పురుగుమందుల తయారీ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ తనిఖీ చేశారు. తయారీ కేంద్రంలోని వివిధ రకాల యంత్రాల పనితీరును పరిశీలించారు. సంస్థకు కావలసిన అనుమతి పత్రాలు చిన్న తరహా, పర్యావరణ, కాలుష్య నియంత్రణ పత్రాలను పరిశీలించారు. కనపర్రు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన మైనంపాడులో గల కిసాన్ ఆగ్రో కెమికల్స్, రాశీ కెమికల్స్‌లో తయారౌతున్న సూక్ష్మ పోషక ఎరువుల తయారీ పరిశీలించారు. యజమానులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ఉత్పత్తులు ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికార కార్యాలయ ఏడీఏ సీహెచ్ రవికుమార్, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్ ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేటటౌన్: డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం డైరెక్టర్ బి.బాలునాయక్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పురుషోత్తమపట్నం మండల సమాఖ్య కార్యాలయంలో మండలస్థాయి వీవోఏల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోన్లు తీసుకొనే ప్రతి గ్రూపు వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీపీఎం కె.హనుమంత్ నాయక్, ఏపీఎం భరత్‌కుమార్ పాల్గొన్నారు.

విజయానికి వారధులుగా నిలవాలి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సచివాలయ కన్వీనర్లు, గృహసారధులకు మంత్రి పిలుపు



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు రానున్న ఎన్నికల్లో విజయానికి వారధులుగా నిలవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాలులో సచివాలయ కన్వీనర్లకు ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం, జేసీఎస్ సైన్యం యాప్‌లో నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులపై గురుతర బాధ్యత ఉందని తెలిపారు. వారంతా జగనన్న సైన్యంలా అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసి పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను తీసుకువెళ్లాలని సూచించారు.సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ప్రతి సచివాలయ కన్వీనర్ ఇన్సూరెన్స్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి మండలంలో గత ఎన్నికల కన్నా మెజార్టీలు పెరిగేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషి చేయాలని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్ బ్రహ్మస్వాములు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ తలహాఖాన్, గుత్తా యాములయ్య, ఘంటా శంకర్, సొసైటీల అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం..

యడ్లపాడు: జనరంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని..అడక్కుండానే అన్ని ఇస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండి మళ్లీ అధికారంలోకి తేవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో మూడోరోజైన శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ముందుగా గ్రామంలోని బస్టాండ్ వద్ద నుంచి ఇంటింటి కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలోని హైస్కూల్ రోడ్డు నుంచి సీతారామపురం వెళ్లే మార్గంలో రూ.35 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును మంత్రి విడదల రజిని పార్టీ నాయకులతో కలిసి లాంఛనంగా ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ సీనియర్ నాయకులు విడదల గోపీనాథ్, బైరా కృష్ణ, ఘంటా శంకర్, జెడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, సొసైటీ చైర్మన్లు ఓరుగంటి పూర్ణయ్య, సర్పంచ్ దంటూ సరళా, రామారావు, ఉపసర్పంచ్ చాగంటి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు గుత్తి రమాదేవి, యడ్లపల్లి సత్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు సామినేని రాఘవ, గళ్లా ప్రభాకర్, వెంకట్రావు, దంటూ ఏసోబు, గుత్తి సింగయ్య, ప్రత్తిపాటి వేణు, తోకల నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వర్లు, యడ్లపల్లి శ్రీరామమూర్తి, రాజుపాలెం చినరమణయ్య, కాకుమాను విజయ్, వలేటి ఉదయ్ కిరణ్, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, పావులూరి వాసు, ముజాఫా, పఠాన్ తలహాఖాన్ పాల్గొన్నారు.

రూ. కోట్లతో శివారు ప్రాంతాల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణ శివారు ప్రాంతాలలో కోట్ల రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివారెడ్డి వెల్లడించారు. శుక్రవారం 25వ వార్డు రెడ్డినగర్, పోస్టల్ కాలనీల్లో రూ.61 లక్షల వ్యయంతో చేపట్టి పూర్తిచేసిన సీసీ రోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. మరో రూ.34 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు టెంకాయ కొట్టి శంకుస్థాపన. ఈ ప్రాంతాన్ని పంచాయతీ పరిధి నుంచి పురపాలక పరిధిలోకి తీసుకొచ్చిన తర్వాత రూ.1.94 కోట్ల వ్యయంతో చేపట్టిన మెయిన్‌రోడ్డు, సీసీరోడ్లు, డ్రెయిన్లు లాంటి అభివృద్ధి పనులు అన్నింటినీ పూర్తి చేశామన్నారు. తాగునీటి సదుపాయం లేకపోవటంతో పైపు లు వేసి ఆ సదుపాయం కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, డీఈ ఓ.శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మల్లెల అశోక్, నాయకులు పి.వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి,అయ్యపురెడ్డి పాల్గొన్నారు.

వారిద్దరి వల్ల రాష్ట్రానికి నిష్ప్రయోజనం

నరసరావుపేట: చంద్రబాబు గత ఐదేళ్లకాలంలో అబద్ధాలతో పరిపాలించి ఒక్క పథకం కూడా ఏ కుటుంబానికి అందజేయలేదనీ, అసలు పవన్, బాబుల వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 21వ వార్డు రామిరెడ్డిపేట మసీదు సెంటర్ నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ఆ కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వార్డుకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం అందజేసే నిధులతో అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, నాయకులు సయ్యద్ మహమూదా, కాకుమాను సదాశివరెడ్డి, జేకే కరిముల్లా, జాఫర్, గఫార్, బాబు, షేక్ జబ్బార్ పాల్గొన్నారు.

ఆలయాలలో శ్రావణ శుక్రవార పూజలు



నాదెండ్లలో దర్శనమిచ్చిన అమ్మవారు



బోయపాలెంలో పార్వతీదేవి అమ్మవారు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న కోలాటం బృందం సభ్యులు

నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. భక్తులు అధికసంఖ్యలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. శృంగేరీ శంకరమఠంలోని శారదాంబ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే పాతూరులోని శివాలయం, చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం, విజయ చాముండేశ్వరీ అమ్మవారు తదితర ఆలయాలలో భక్తుల సందడి కనిపించింది. రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలో 125 మంది సువాసినులచే కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త తాటికొండ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో టి.రామచంద్రరావు, చేగు వేంకటేశ్వరరావు, ఆత్మకూరి రాజేంద్రప్రసాద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాలమ్మ దేవాలయంలో శ్రావణ మాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకొని అభిషేకాలు అర్చనలు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రాంగణంలో మహిళ భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు పసుపు, కుంకుమ సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి అడవి పేరంటాలమ్మ కోలాట బృందం ఆధ్వర్యంలో అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహించారు. అనంతరం కోలాటం మాస్టారు యలగాల శ్రీకాంత్‌ను దుశ్శాలువా, పూలమాలలో ఘనంగా సత్కరించి బహుమతిని అందజేశారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: శ్రావణమాసం తొలి శుక్రవారం నాడు మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునే అమ్మవారి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. అర్చకులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ గావించి భక్తులకు పలు రకాల ప్రసాదాలను వితరణ చేశారు. ఈ నేపథ్యంలో యడ్లపాడు, బోయపాలెం, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, తిమ్మాపురం, జాలాది, జగ్గాపురం, ఉన్నవ తదితర గ్రామాల్లోని ఆలయాలు శుక్రవారం భక్తులతో కళకళలాడాయి.

నాదెండ్లలో...

నాదెండ్ల: సకల శుభాలకు శుభారంభం శ్రావణ శుక్రవారం. ఈ మాసంలోని తొలి శుక్రవారాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గణపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశిష్ట పూజలు జరిగాయి. అలాగే నేడు కన్యకాపరమేశ్వరి అమ్మ వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పూజారి అనిల్‌కుమార్ తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండల ప్రజలు శ్రావణ మాస మొదటి శుక్రవార వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వాకాని కోదండరామ దీక్షితులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు దేవాలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయండి

వ్యవసాయాధికారులకు సూచించిన జిల్లా అధికారి



చిన్నతురకపాలెం గ్రామంలో ప్రత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నరసరావుపేట: జిల్లాలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నరసరావుపేట మండలంలోని గోనెపూడి ఆర్‌బీకే పరిధిలో పరిశీలించారు. ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో తెలుసుకున్నారు. ఆర్‌బీకేలో రికార్డులను తనిఖీ చేసి సూచనలు చేశారు. అనంతరం చిన్నతురకపాలెం గ్రామ పరిధిలో ప్రత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. గడిచిన సీజన్‌తో పోల్చితే ఈఏడాది ప్రత్తిసాగు తగ్గి మొక్కజొన్న సాగువైపు రైతులు మొగ్గుచూపినట్లుగా తెలిపారు. అందువలన రైతులు మేలైన మొక్కజొన్న విత్తనాలకోసం ఆర్‌బీకేల ద్వారా వీఏఏలకు తెలియచేస్తే వారికి మేలైన విత్తనాలను విక్రయించే సదుపాయం కల్పిస్తారన్నారు. ఏడీఏ పి.మస్తానమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

21తో ముగియనున్న ఓటర్ల జాబితా సర్వే

శావల్యాపురం: ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 32 వేల 810 ఓట్లు ఉండగా 34 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బీఎల్‌వోలు 23 వేల 563 మంది ఓటర్ల సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. ఈనెల 21న ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఫామ్-6 అర్జీలు సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియలో బీఎల్‌వోలు తమ విధులు అంకిత భావంతో నిర్వహించటంతో పాటు అన్నీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ చంద్రబాబు, పి.నాసరయ్య ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: భార్యభర్తల మధ్య వివాదం నేపథ్యంలో భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మండలంలోని తాతపూడి గ్రామానికి చెందిన నర్రా సురేష్‌తో మృదుల (31)కు ఎనిమిది సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. ఈ నెల 16 తేదీ భార్యభర్తలకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మృదుల 17వ తేదీ తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో చీరెతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త, బంధువులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రూరల్ పోలీసులు మృతురాలి తండ్రి గరికపాటి వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'స్వయం' సభ్యులు అప్రమత్తంగా ఉండాలి

డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ హెచ్చరిక

యడ్లపాడు: స్వయం సహాయక సంఘాల్లో ఆర్థిక మోసాలు జరగకుండా సభ్యులు తమ ప్రాథమిక సిద్ధాంతం ప్రకారంగా ప్రతినెలా ఒక సభ్యురాలు విధిగా బ్యాంకుకు వెళ్లి నగదు చెల్లింపులు చేసుకోవాలని పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్ తెలిపారు. బ్యాంక్ లింకేజీ విభాగం డీపీఎం హనుమానాయక్‌తో కలిసి శుక్రవారం యడ్లపాడు గ్రామాన్ని సందర్శించారు. స్థానిక ఆర్‌బీకేలో వీవోలతో సమీక్షను నిర్వహించి మండలం పరిధిలో ఇటీవల వెలుగు చూసిన వీవోల అక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏపీఎం జీవన్ తిమ్మాపురంలో మూడు గ్రామైక్య సంఘాల్లోని ఆరు గ్రూపుల్లో వీవోల చేసిన అవినీతిని పీడీ దృష్టికి తెచ్చారు. తిమ్మాపురం వీవోలుగా పనిచేస్తున్న పుల్లగూర లక్ష్మి, పి.రమాదేవి, బి.వనజ తమ పరిధిలోని సంఘ సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ గ్రూపుల్ని సృష్టించి బ్యాంకు రుణాలు పొందినట్లు ఆన్‌లైన్‌లో గుర్తించామన్నారు. వెంటనే ఈ ఏడాది ఏప్రిల్ 11న చిలకలూరిపేట జీడీసీసీ బ్యాంక్ అధికారులకు రుణాలు పొందిన సంఘాల వివరాలను కోరామన్నారు. జులై 20న బ్యాంక్ అధికారులు ఇచ్చిన రుణాల జాబితాను పరిశీలించగా అవకతవకలు జరిగినట్లు తెలిసిందన్నారు. జీడీసీసీ బ్యాంక్‌లో మాత్రమే అవినీతి జరిగిందని స్పష్టం కావడంతో ఫోర్జరీ సంతకాలు, నకిలీ గ్రూపులపై ఏర్పాటుపై సీసీ బి.పేరమ్మచే స్టేషన్‌లో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించామన్నారు. ఈనెల 8న మండల సమాఖ్య సమావేశంలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు వీవోలను విధుల నుంచి తొలగించాలని తీర్మానం చేసి వారికి నోటీసులిచ్చామని తెలిపారు. ఇకపై ఇటువంటివి వెలుగుచూస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతిపథం సీసీలు, వీవోలు ఉన్నారు.

ఘనంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవం రెండవ రోజు కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి పుణ్యాహవాచనం, కుంభారాధనం, అగ్నిప్రణయణం, హారతి, మహాశాంతి ఆవాహనం, పుష్పాధివాసం, ప్రధాన దేవతల ఆవాహనం, లఘు పూర్ణాహుతి, హారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు నారాయణం వెంకట హనుమంతా చార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, పలువురు రుత్విక్‌లు పాల్గొని పూజా, హోమ కార్యక్రమాల నిర్వహించారు.

సర్వీసులు క్రమబద్ధీకరించాలని వినతి

నరసరావుపేట: రాష్ట్రంలో 1993 నవంబరు 25 కంటే ముందుగా నియమించబడి మినిమం టైమ్‌స్కేలుపై ఎన్ఎంఆర్, డెయిలీ వేజ్, కన్సాలిడేట్ పే, ఫుల్‌టైమ్, పార్టుటైమ్ కంటింజెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు సీనియార్టీకి ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని టైమ్ స్కేలు సంయుక్త కార్యాచరణ కమిటీ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో కె.వినాయకంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్‌కు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు నర్రా శ్రీనివాసరావు, జి.రవీంద్రబాబు, కోశాధికారి వైవీ చంద్రరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నూజెండ్ల మండలం నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన నాదెండ్ల మోహన్‌రావు, గోగు నాగేశ్వరరావులు వ్యక్తిగత పనులపై వినుకొండ వస్తుండగా వినుకొండ నుంచి యర్రగొండపాలెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో గోగు నాగేశ్వరరావు (45) అక్కడికక్కడే మృతిచెందగా మోహన్‌రావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జిలానీ

నరసరావుపేట: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా అమ్మా జిలానీ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని జిలానీకి సూచించారు. సీనియర్ నాయకులు కృపారావు, హనుమంతరావు, మధుబాబు, రవిశంకర్ అభినందించారు.

సంక్షిప్తంగా..

జిల్లా ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షురాలిగా ఝాన్సీ

యడ్లపాడు: ప్రస్తుతం యడ్లపాడు మండల ఎంపీపీ పిడతల ఝాన్సీ మరో మూడు ప్రధాన కమిటీల్లో భాగస్వామ్యం పొందినట్లు శుక్రవారం చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఆమె ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల సంఘం ఉపాధ్యక్షురాలిగా, మండల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కో చైర్మన్ అలాగే మండల విద్యుత్ సబ్‌స్టేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

ఏజీఎంగా బాల కృష్ణారెడ్డి

నరసరావుపేట: పట్టణానికి చెందిన బత్తుల బాల కృష్ణారెడ్డి జీడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు బ్యాంకు చైర్‌పర్సన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, బ్యాంకు సీఈవో టి. కృష్ణవేణిల నుంచి శుక్రవారం పదోన్నతి నియామక పత్రం అందుకున్నారు.

నేడు ఛాయాచిత్ర ప్రదర్శన

నరసరావుపేట: స్థానిక భువనచంద్రటౌన్ హాలులో ఉదయం 10 గంటలకు ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎల్. శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాకు చెందిన ఫొటోగ్రఫీపై ఆసక్తి కలిగిన వారు ప్రదర్శనలో పాల్గొని తమ ఫొటోలను ప్రదర్శించవచ్చునని తెలిపారు.

నేడు మూడు వార్డులకు ఉప ఎన్నికలు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి, ఉప్పరపాలెం పంచాయతీ పరిధిలోని వార్డులకు ఉప ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఉప్పరపాలెంలోని 8వ వార్డుకు, బొమ్మరాజుపల్లిలోని 1,7 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

త్వరలో జనరిక్ మందుల దుకాణం

శావల్యాపురం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సారథ్యంలో త్వరలో శావల్యాపురం ప్రధానసెంటరు మార్గంలో జనరిక్ మందుల (ఔషధ దుకాణం) దుకాణాన్ని ప్రారంభిస్తు న్నట్లు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు శుక్రవా రం తెలిపారు.

సీఐ సాంబశివరావుకు సన్మానం

వినుకొండ(నూజెండ్ల) : ఉత్తమ సీఐగా అవార్డు అందుకున్న సాంబశివరావును నియోజకవర్గ సాంఘికనాటక డైరెక్టర్స్ అండ్ డాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరిబాబు, వెంకటేష్, మాచర్ల ఏసోబు, వంగల ఇశ్రాయిల్, డీఐ కుమార్, కట్టెంపూడి నాగేశ్వరరావు, డి.సైకిలాబ్, కోటయ్య, తిరుపతిరావు, కోటి, సుధీర్, చిరంజీవి, ఆదాం తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రఫీలో పేటవాసికి ప్రథమస్థానం

నరసరావుపేట: దేశవ్యాప్తంగా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వహించిన బెస్ట్ ఫొటోగ్రఫీ ఆఫ్ ది ఇయర్-2023 పోటీలలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి చెందిన వెంకట నాగసాయి రాఘవేంద్ర తీసిన ఫొటో ప్రథమ స్థానంలో నిల్చింది. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ విజయవాడ నిర్వహించిన 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలలో ఈ అవార్డును స్వీకరించారు.

పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, దాసరి పాలెం, మర్రిచెట్టుపాలెం, మాచవరం, సంతగుడిపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వి.రెడ్డిపాలెం గ్రామంలో 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందజేసేందుకు రూ.1 కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన పథకానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల రామకృష్ణ, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, బత్తుల అంజయ్య, పొలిమేర వెంకటరెడ్డి, పొలిమేర శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్ పర్సన్ పొలిమేర వెంకటరెడ్డి, వరికూటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఉద్యోగ సాధన కోసమే చదవాలి

నరసరావుపేట: ఇంజినీరింగ్ అనేది కేవలం సర్టిఫికెట్ కోసమే కాకుండా ఉద్యోగ సాధనమే లక్ష్యంగా చదవాలని ఎన్‌సీసీ గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఈసీ)లో శుక్రవారం నిర్వహించిన ఏస్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ వర్సెస్ ఏస్ ఎంప్లాయబుల్ ఇంజినీర్ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, ఎన్‌సీసీ అధికారి రాజేష్‌బాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిందు సేద్యం పరిశీలన

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ వ్యవసాయాధికారులు బృందం శుక్రవారం నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోని పలు గ్రామాలను సందర్శించి బిందుసేద్యం వలన కలుగుతున్న ప్రయోజనాలు పరిశీలించారు.

నేడే విప్పర్లపల్లిలో పోలింగ్

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డుకు శనివారం నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎండీవో మాధ్యుబాబు శుక్రవారం తెలిపారు.

ప్రతి ఇల్లు ఆర్థికంగా ఎదగాలి: యడ్లపాడు ఎంపీపీ

యడ్లపాడు: ప్రతిబిడ్డా చదవాలి.. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలి అన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని దానిని అంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ ఝాన్సీ మాట్లాడుతూ నవరత్న పథకాలతో కుటుంబ ఆర్థిక పరిపుష్టి చేస్తూనే ఆయా కుటుంబాల్లోని పిల్లల్ని మంచి విద్యావంతుల్ని చేయడమే లక్ష్యంగా అనేక నాడు-నేడుతో సర్కారు పాఠశాలల రూపురేఖల్ని మార్చారన్నారు. ఈ నేపథ్యంలో యడ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో ప్లస్‌టూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారని, గ్రామీణ ప్రాంత బాలికలు సద్వినియోగం చేసుకునేలా ప్రజా ప్రతినిధులు ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. గడపగడపకూ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొని అన్నిగ్రామాల్లోని గృహాలకు వెళ్లి నాలుగేళ్ల పాలనల్లో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ..స్థానిక సమస్యల్ని తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల పరిశుభ్రతకు పంచాయతీలతో పాటు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నరసరావుపేట టౌన్: విద్యార్థిని మిస్సింగ్ కేసును వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. అదృశ్యమైన బాలికను శుక్రవారం సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన 17 సంవత్సరాల బాలిక నరసరావుపేట పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతోంది. బుధవారం కళాశాలకు అని చెప్పి ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరిన బాలిక తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ అశోక్ కుమార్ దర్యాప్తును ప్రారంభించారు. కళాశాల సిబ్బందిని, విద్యార్థిని స్నేహితులను విచారించారు. విజయవాడ బస్టాండ్‌లో బాలిక ఉన్నట్లు సమాచారం అందుకున్న సీఐ అశోక్‌కుమార్ వెంటనే అక్కడికి వెళ్లి బాలికను సురక్షితంగా స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణలో మానసిక ఒత్తిడి వల్ల తాను ఇంటి నుంచి వెళ్లినట్లు బాలిక పోలీసులకు వివరించింది. తల్లిదండ్రులను రప్పించి బాలికను అప్పగించారు.